



నర్సీపట్నంలో అన్న క్యాంటీన్ వద్ద బారులుతీరిన జనం (ఫైల్ ఫొటో)

నాడు


ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలోని అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలు (ఫైల్ ఫొటో)

నేడు


ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో నిరుపయోగంగా మారిన అన్న క్యాంటీన్ భవనం

అన్న క్యాంటీన్లపై కక్ష

అధికారంలోకి వచ్చిన వెంటనే మూసివేయించిన వైసీపీ పాలకులు

- పేదలకు దూరమైన కారుచౌక భోజనం
- టీడీపీ హయాంలో అనకాపల్లి, నర్సీపట్నంలో 'అన్న క్యాంటీన్'లు ఏర్పాటు
- రూ.15కే రుచికరమైన అల్పాహారం, రెండు పూటల భోజనాలు
- కూలీలు, కార్మికులు, చిరువ్యాపారులతో సహా ఎంతోమందికి దోహదం
- ఒక్కో క్యాంటీన్‌లో రోజూ వెయ్యి మందికిపైగా ఆహారం
- ప్రజల నుంచి విపరీతంగా పెరిగిన ఆదరణ
- అధికారంలోకి రాగానే కక్షపూరితంగా వ్యవహరించిన వైసీపీ పాలకులు
- నిర్లక్ష్యంగా అన్న క్యాంటీన్లకు తాళాలు
- నిరుపయోగంగా భవనాలు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లపై వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించింది. కార్మికులు, కూలీలు, చిరుద్యోగులు, ఆటో డ్రైవర్లు, వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే గ్రామీణులు, ఫుట్‌పాత్ వ్యాపారులు, తదితర వర్గాల వారికి కడుపు నిండా పట్టెడు అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో నాడు టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'అన్న క్యాంటీన్'లను నిర్లక్ష్యంగా మూసివేసింది. మీకు నచ్చిన పేరు పెట్టుకుని, క్యాంటీన్లను కొనసాగించాలని టీడీపీ అధినేత చంద్రబాబుతోసహా పలువురు నాయకులు విజ్ఞప్తి చేసినప్పటికీ వైసీపీ పాలకులు ససేమిరా అన్నారు. నిరుపేదలకు ఐదు రూపాయలకే భోజనం అందకుండా చేశారు. మరోవైపు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన అన్న క్యాంటీన్ భవనాలను నిరుపయోగంగా గాలికొదిలేసింది. తుప్పలు పెరిగిపోయి, సామగ్రి పాడైపోయి పాడుబడిన భవనాల్లా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఈ భవనాలను చూసి వైసీపీ నేతలు రాక్షస ఆనందాన్ని పొందుతున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.


అనకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద పాడుబడిన అన్న క్యాంటీన్ భవనం

అనకాపల్లి టౌన్, మార్చి 20: తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు 2018 జూలై 11వ తేదీన అనకాపల్లిలో ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్ టికెట్ బుకింగ్ కౌంటర్‌కు వెళ్లే మార్గంలో.. రెండుచోట్ల అన్న క్యాంటీన్లు ప్రారంభించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టేవారు. ఇందుకోసం కేవలం రూ.5 మాత్రమే వసూలు చేసేవారు. కూలీలు, కార్మికులు, చిరు వ్యాపారులు, రిక్షా వాలాలు, ఆటో డ్రైవర్లు, తదితరులు రూ.15కే అల్పాహారం, రెండు పూటలా భోజనం చేసేవారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్ జిల్లా నలుమూలల నుంచి వైద్యం పొందడానికి వచ్చే రోగులతోపాటు వైద్యాలయంలో చికిత్స పొందుతున్న రోగుల బంధువులు, సహాయకులు, సమీపంలో ఉన్న ... మిగతా 8వ పేజీలో

నర్సీపట్నంలో నిర్లక్ష్యం

- పాడుబడిన అన్న క్యాంటీన్ భవనం
- పేరుకుపోయిన చెత్తాచెదారం


ప్రస్తుతం అన్న క్యాంటీన్ పరిస్థితి

నర్సీపట్నం, మార్చి 20: నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఎదురుగా 2019 జనవరి 11న అప్పటి ఆర్అండ్‌బీ శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. అక్షయపాత్ర సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో విశాఖపట్నం నుంచి ఆహార పదార్థాలు వచ్చేవి. క్యాంటీన్‌లో ఇద్దరు భోజనం వడ్డనకు, ఇద్దరు ప్లేట్లు శుభ్రం చేయడానికి, ఒకరు టోకెన్ల జారీకి, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు పని చేసేవారు. ఉదయం అల్పాహారం 350 మందికి, మధ్యాహ్నం భోజనం 350 మందికి, రాత్రి భోజనం 250 మందికి వడ్డించేవారు. ప్రాంతీయ ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు, రోజువారీ కూలీలు, ఫుట్‌పాత్ వ్యాపారులు, ఆటో డ్రైవర్లు ఎక్కువగా ఇక్కడ భోజనాలు చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టిఫిన్లు, భోజనాల్లో కోత పెట్టింది. టిఫిన్లు 150 మందికి, భోజనాలు 200 మందికి పరిమితం చేశారు. తర్వాత కొద్ది రోజులకు క్యాంటీన్‌ను పూర్తిగా మూసేశారు. మునిసిపల్ అధికారులు భవనాన్ని స్వాధీనం చేసుకుని నెల క్రితం వరకు అర్బన్ పీహెచ్‌సీ నడిపారు. ఆస్పత్రిని గవరవీధిలోని సొంత భవనంలోకి తరలించడంతో అన్న క్యాంటిన్ భవనం నిరుపయోగంగా మారింది. మందుల వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకపోయాయి. స్టెయిన్‌లెస్ స్టీల్ డైనింగ్ టేబుళ్లను బయట వుంచేశారు. వాష్‌బేసిన్ పైపులు, ట్యాపులు కనిపించడంలేదు. ప్రస్తుతం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సొంత ఖర్చుతో సంచార అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఎనిమిది నెలల నుంచి రోజూ మధ్యాహ్నం ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ భవనం వద్దకు వ్యాన్‌లో ఆహార పదార్థాలు తీసుకువచ్చి రూ.2లకే భోజనం పెడుతున్నారు.


ట్యాపులు లేని వాష్ బేసిన్


బయట పడేసిన డైనింగ్ టేబుళ్లు

అకాల వర్షం!

జిల్లా అంతటా ముసురు

పలు మండలాల్లో ఈదురుగాలులతో కుండపోత

- విరిగిన విద్యుత్ స్తంభాలు, కూలిన చెట్లు
- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- వర్షంతో కొన్ని పంటలకు మేలు, చేతికొచ్చిన అపరాల పంటలకు నష్టం
- వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం


అనకాపల్లిలో కురుస్తున్న వర్షం

(ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్)

జిల్లా అంతటా బుధవారం ముసురు వాతావరణం నెలకొంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో నెలకొన్న అధికపీడనం కారణంగా సముద్రం మీద నుంచి భూమిపైకి తేమగాలులు వీస్తుండడంతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయి, వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం చెందారు. ఈ వర్షం కూరగాయ పంటలు, సరుగుడు తోటలు, కార్శి చెరకు, వేసవి నువ్వు పైరుకు ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. ఇదే సమయంలో కోతకు వచ్చిన మినుము, పెసర, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు.

అనకాపల్లి ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం 11 గంటల నుంచి వర్షం మొదలైంది. రాత్రి వరకు దఫదఫాలుగా కురిసింది. అనకాపల్లితోపాటు మునగపాక, కశింకోట, ఎలమంచిలి, సబ్బవరం, చోడవరం, నాతవరం తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. పరవాడ, గొలుగొండ, బుచ్చెయ్యపేట, రావికమతం, ఎలమంచిలి, ఎస్.రాయవరం సహా పలు మండలాల్లో మోస్తరు జల్లులు పడ్డాయి. కాగా అనకాపల్లి-చోడవరం మార్గంలో తుమ్మపాల, బవులువాడ, మామిడిపాలెం, తదితర గ్రామాల వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో వర్షం నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి మునగపాక మీదుగా అచ్యుతాపురం వెళ్లే ప్రధాన రహదారిపైనే ఇదే పరిస్థితి నెలకొంది. ఈ రహదారి మరమ్మతు పనులకు వీఎంఆర్‌డీఏ రూ.4.75 కోట్లు మంజూరు చేయడంతో గత నెలలో ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు శంకుస్థాపన కూడా చేశారు. కాంట్రాక్టరు పనులు ప్రారంభించి రహదారిని తవ్వేసి వదిలేయడంతో గుంతల్లో వర్షపు నీరు చేరింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చోడవరం మండలంలో ఈదురు గాలులు వీచడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ ... మిగతా 8వ పేజీలో


ఎలమంచిలి మండలం పులపర్తిలో ఈదురు గాలులకు విద్యుత్ తీగలపై పడిన కొబ్బరి చెట్టు

మాట ఇచ్చి, మడమ తిప్పి..

ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లకు జగన్ ధోకా



- కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రతకు నాడు ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో హామీ
- ఐదేళ్లు పూర్తయినా నెరవేర్చని వైనం
- అధికారంలోకి వచ్చిన తరువాత రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు
- ఇప్పటికీ వెలుగుచూడని నివేదిక
- ఉమ్మడి జిల్లాలో సుమారు 35 వేల మంది ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు
- వైసీపీ సర్కారుకు గుణపాఠం చెబుతామంటున్న ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు

విశాఖపట్నం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

"ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు కనీస వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు టీచర్ల స్థితిగతులు మెరుగుపర్చేందుకు ఒక రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుచేస్తాం. ఆ కమిషన్ ఇచ్చే నివేదిక మేరకు మెరుగైన పరిస్థితులు తీసుకువస్తాం"

- పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ.

...అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని జగన్మోహన్‌రెడ్డి విస్మరించారని ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమ డిమాండ్లతో కూడిన బ్యానర్‌ను కూడా పట్టుకుని మరీ పాదయాత్ర చేసిన జగన్మోహన్‌రెడ్డి...ఏరు దాటిన తరువాత తెప్పను తగలేసినట్టు అధికారంలోకి వచ్చిన తరువాత తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది వరకూ ఉండగా, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 300కుపైగా కాలేజీలు, స్కూల్స్‌లో 35 వేల మంది వరకూ పనిచేస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీరికి కనీస వేతనాలు అందడం లేదు. ఇప్పటికీ దాదాపు 70 శాతం మందికి రూ.5 వేలు నుంచి రూ.15 వేల మధ్య వేతనంగా లభిస్తోంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, వారికి పీఎఫ్, ఈఎస్ఐ వంటివి అమలు చేయడం లేదు. అదేవిధంగా ఏడాదిలో పది నెలలకు మాత్రమే వేతనాలను పొందు తున్నారు. వేసవి సెలవుల్లో చాలా స్కూల్స్ యాజమాన్యాలు జీతాలు ఇవ్వడం లేదు. ప్రైవేటు స్కూల్స్, కాలేజీల్లో పనిచేసే టీచర్లు/లెక్చరర్లతోపాటు ఆయాలు, బస్ డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాన్ని కల్పించాలని, వేసవి సెలవుల్లో కూడా జీతాలు చెల్లించేలా, ప్రభుత్వ సెలవులు వర్తించేలా చూడాలని, జీవో నంబర్ ఎంఎస్-1ను విధిగా అమలు చేయాలని, ప్రధానంగా ఉద్యోగ భద్రతను కల్పించాలని చాలాకాలంగా కోరుతున్నారు. ఆ హామీలను నెరవేరుస్తానని ... మిగతా 8వ పేజీలో



పాదయాత్ర సమయంలో ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ డిమాండ్ల ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న జగన్మోహన్‌రెడ్డి (ఫైల్ ఫొటో)


స్వర్ణాలంకరణలో భక్తులకు విశేష దర్శనమిస్తున్న ఉపమాక వెంకన్న, అమ్మవార్లు

స్వర్ణాలంకరణలో వెంకన్న

నక్కపల్లి మండలం ఉపమాక క్షేత్రంలో వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా వేంకటేశ్వరస్వామి బుధవారం స్వర్ణాలంకరణలో భక్తులకు విశిష్ట దర్శనమిచ్చారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు.. ఉభయ దేవేరులతో పాటు వేంకటేశ్వరస్వామి వారిని పలు రకాల ఆభరణాలతో అలంకరించారు.

బుచ్చెయ్యపేట మండలం వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలను బుధవారం ధ్వజారోహణం, అంకురార్పణతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పసిడి ఆభరణాలతో అలంకరించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. - 7లో


వడ్డాదిలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

క్రైం... crime news

ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రావెల్ బస్సు

» తీవ్రంగా గాయపడి మృతిచెందిన యువకుడు


మీరా సాహెబ్ (ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, మార్చి 20: ట్రాక్టర్‌ను డ్రైవర్ అప్పగించి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిన ఆ యువకుడు, రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తండ్రికి ఫోన్ చేసి తాను ప్రమాదానికి గురైనట్టు చెప్పాడు. కొద్దిసేపట్లో అక్కడకు చేరుకున్న తండ్రి.. పోలీసుల సాయంతో కుమారుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కానీ అప్పటికే పరిస్థితి విషమించడంతో తండ్రి చేతుల్లోనే ప్రాణాలు వదిలాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

ఎస్.రాయవరం మండలం ఒమ్మవరం గ్రామానికి చెందిన షేక్ మీరాసాహెబ్(27) ఉపాధి నిమిత్తం ఇటీవల ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఇతని తండ్రి షేక్ నన్నాసాహెబ్ ఒమ్మవరంలో చికెన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఎలమంచిలి మండలం పులపర్తికి చెందిన ఒక వ్యక్తిని డ్రైవర్‌గా నియమించుకున్నాడు. మంగళవారం రాత్రి ట్రాక్టర్‌ను అతనికి అప్పగించి వస్తానని ఇంటివద్ద చెప్పి బయలుదేరాడు. పదిన్నర గంటల సమయానికి పులపర్తి సమీపంలోకి వచ్చాడు. ఇదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఒక ట్రావెల్ బస్సు ఓవర్‌టేక్ చేసే క్రమంలో ట్రాక్టర్‌ను ఢీకొన్నది. దీంతో ట్రాక్టర్ స్టీరింగ్ మీరాసాహెబ్ కడుపునకు బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తనకు ప్రమాదం జరిగినట్టు తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. నన్నాసాహెబ్ కొద్దిసేపట్లోనే సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసుల సహాయంతో అంబులెన్స్‌లో ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అయితే అంతర్గత అవయవాలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స పొందుతూ తండ్రి చేతిలోనే ప్రాణాలు వదిలాడు. దీంతో నన్నాసాహెబ్ కన్నీరుమున్నీరు అయ్యాడు. కాగా మీరాసాహెబ్‌కు సుమారు ఆరు నెలల క్రితం వివాహమైందని, భార్య ప్రస్తుతం మూడు నెలల గర్భిణి అని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 20: పట్టణానికి సమీపంలోని జలగలమదుం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. దీనికి సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మాకవరపాలెం మండలం పి.అగ్రహారం గ్రామానికి చెందిన కడారి గంగతల్లి (54) క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో ఆమెను అల్లుడు జి.దారబాబు అగనంపూడి వద్ద గల క్యాన్సర్ ఆస్పత్రికి ద్విచక్ర వాహనంపై బుధవారం ఉదయం తీసుకువెళుతున్నాడు. జలగలమదుం జంక్షన్ వద్దకు వచ్చే సరికి ప్రమాదవశాత్తూ గంగతల్లి వాహనం పైనుంచి పడిపోవడంతో తలకు బలమైన గాయాలు తగిలాయి. విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి, మార్చి 20: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎస్.రాయవరం మండలం ఒమ్మవరం గ్రామానికి చెందిన నూర్ బుధవారం ద్విచక్ర వాహనంపై ఎలమంచిలి వస్తున్నాడు. ఎలమంచిలి మండలం యర్రవరం పోలిమేరమ్మతల్లి అమ్మవారి ఆలయ సమీపానికి వచ్చేసరికి యర్రవరం నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం అతనిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నూర్‌ను స్థానికులు ఎలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మంగళవారం రాత్రి పులపర్తి సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఎలమంచిలి వస్తుండగా నూర్ ఈ ప్రమాదానికి గురైనట్టు తెలిసింది.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, మార్చి 20: దేవరాపల్లి మండలం బల్లిపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్టు బుధవారం ఫిర్యాదు అందిందని పట్టణ హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. దేవరాపల్లి మండలం బల్లిపురం గ్రామానికి చెందిన తామర్ల కొండబాబు గోదావరి జిల్లాల్లో వ్యవసాయ పనులకు వెళ్లి ఈ నెల మూడో తేదీన అరకుకు చెందిన వ్యక్తితో ఆర్టీసీ బస్సులో అనకాపల్లికి చేరుకున్నాడు. అరకుకు చెందిన వ్యక్తి స్వగ్రామం వెళ్లిపోగా, కొండబాబు ఆచూకీ లభించకపోవడంతో అతని తండ్రి బుచ్చిబాబు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

4 కిలోల గంజాయి స్వాధీనం: ఒకరి అరెస్టు

అనకాపల్లి టౌన్, మార్చి 20: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని గూడ్స్ షెడ్ వద్ద బుధవారం తమిళనాడుకు చెందిన ఓ యువకుడిని అరెస్టు చేసి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ జి.శంకరరావు తెలిపారు. దీనికి సంబంధించి సీఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తమిళనాడుకు చెందిన వరదరాజన్ గణేశ్(21) బుధవారం చోడవరం నుంచి నాలుగు కిలోల గంజాయితో తమిళనాడు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వస్తుండగా ఆ మార్గంలో ఎన్నికల విధుల్లో ఉన్న ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది గణేష్‌కి అతనిపై అనుమానం వచ్చింది. అతని బ్యాగ్ తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి బయటపడిందన్నారు. ఈ మేరకు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ శంకరరావు తెలిపారు. కేసును ఎస్ఐ సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

కూండ్రంలో పశువుల పాక దగ్ధం

కొత్తూరు, మార్చి 20: మండలంలోని కూండ్రం గ్రామంలో పాడి పశువుల పాక బుధవారం తెల్లవారుజామున దగ్ధమైంది. సాలాపు నాగమణికి చెందిన పాడి పశువుల పాక ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతైంది. ఒకే నెలలో గ్రామంలో ఇటువంటి పాడి పశువుల పాకలు నాలుగు దగ్ధం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వృద్ధుడి సెల్‌ఫోన్ తస్కరించి బైక్‌పై పరారీ

చోడవరం, మార్చి 20: బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు, రోడ్డు పక్కన ఉన్న ఓ వృద్ధుడి నుంచి సెల్‌ఫోన్ తస్కరించుకుపోయిన ఘటన బుధవారం మండలంలోని జన్నవరం వద్ద చోటు చేసుకుంది. జన్నవరం గ్రామానికి చెందిన కడివి ఈశ్వరరావు ం జంక్షన్ సమీపంలో నిలబడి వున్నారు. ఈ సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు అతని సమీపంలోకి వచ్చి పడిపోతున్నట్టు నటిస్తూ.. 'పడిపోతున్నాం పట్టుకోండి' అని పిలిచారు. దీనితో వృద్ధుడు బైక్‌పై నుంచి యువకులు పడిపోకుండా పట్టుకున్నాడు. ఇదే సమయంలో ఆ యువకులు వృద్ధుడి నుంచి సెల్‌ఫోన్ గుంజుకుని అక్కడ నుంచి ఉడాయించారు. తన సెల్‌ఫోన్ పట్టుకుపోతున్నారని ఈశ్వరరావు కేకలు వేయడంతో స్థానికులు వాహనాలపై వారిని వెంబడించినా ఫలితం లేకపోయింది.

42 మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

చోడవరం: మండలంలోని గజపతినగరం జంక్షన్ సమీపంలో అదే గ్రామానికి చెందిన రాపేటి నరసింహ అనే వ్యక్తి నుంచి మంగళవారం రాత్రి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

5 గంటలపాటు సంపూర్ణ వందేమాతరం గీతాలాపన


వందేమాతరం ఆలపిస్తున్న ధీరజ్

నర్సీపట్నం, మార్చి 20: బాల గాయకుడు, పాడుతా తీయగా విన్నర్ ధీరజ్ ఐదు గంటలుపాటు సంపూర్ణ వందేమాతరం గీతాన్ని ఆలపించి రికార్డ్ సృష్టించాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా బుధవారం శారదానగర్ శ్రీసత్యసాయి మందిరంలో ఏర్పాటు చేసిన 'కలిసి పాడుదాం' కార్యక్రమంలో వందేమాతరం గీతాన్ని 77 సార్లు ఆలపించాడు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్విరామంగా సంపూర్ణ వందేమాతర గీతం పాడాడు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

స్వర్ణాలంకరణలో వెంకన్న

» కల్యాణోత్సవాల సందర్భంగా భక్తులకు విశిష్ట దర్శనమిచ్చిన స్వామివారు

» ఘనంగా ధ్వజారోహణం... అర్ధరాత్రి కల్యాణవేడుక


ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి, మార్చి 20: ఉపమాక క్షేత్రంలో వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా వేంకటేశ్వరస్వామి బుధవారం స్వర్ణాలంకరణలో భక్తులకు విశిష్ట దర్శనమిచ్చారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు.. ఉభయ దేవేరులతోపాటు వేంకటేశ్వరస్వామి వారిని పలు రకాల ఆభరణాలతో అలంకరించారు. తొలుత తెల్లవారుజామున మూడు గంటలకు కొండపై వున్న స్వామి నిజరూపానికి ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఇదే సమయంలో కొండ దిగువ ఆలయంలో స్వర్ణాలంకరణలో వున్న స్వామి వారిని రాతి కల్యాణ మండపంలో ఆశీనులనుగావించి భక్తులు దర్శించుకోవడానికి ద్వారాలు తెరిచారు. అప్పటికే వేలాది మంది భక్తులతో ఆలయ ప్రాంగణం, గరుడాద్రి పర్వతం మెట్లమార్గం నిండిపోయింది. కాగా ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి (కల్యాణోత్సవం) రోజున మాత్రమే ఉభయదేవేరులతో కూడిన స్వామివారు వజ్రవైఢూర్యాలు, పచ్చలు, కెంపులతో పొదిగిన బంగారు కిరీటాలు, చింతాకుపతకాలు, కంఠిలు, తదితర ఆభరణాలతో భక్తులకు దర్శనమిస్తారు. కల్యాణ వేంకటేశ్వరుడిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు. తరువాత ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజారోహణ నిర్వహించారు. కాగా విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ, తదితరులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని బహూకరించి, వేద ఆశీర్వచనం చేశారు.


స్వర్ణాలంకరణలో దర్శనమిస్తున్న ఉపమాక వెంకన్నను దర్శించుకుంటున్న డీఐజీ విశాల్ గున్నీ, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ

'పేట'లో లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం


కొత్త డిజైన్ పట్టు చీరను ప్రదర్శిస్తున్న సినీ నటి, యాంకర్ అనసూయ. చిత్రంలో సంస్థ ప్రతినిధులు

పాయకరావుపేట, మార్చి 20 : పాయకరావుపేటలో బుధవారం లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. పట్టణంలోని చిత్రమందిర్ థియేటర్ ఎదుట ఏర్పాటుచేసిన ఈ షాపింగ్ మాల్‌ను ప్రముఖ యాంకర్, సినీ నటి అనసూయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా కొత్త డిజైన్లు, నాణ్యత, అందరికీ అందుబాటులో ఉండే ధరలకు అన్ని రకాల వస్త్రాలను అందజేస్తున్న లక్కీ షాపింగ్ మాల్‌ను పాయకరావుపేట, తుని పరిసర ప్రాంతాల ప్రజలు సందర్శించాలన్నారు. అనంతరం ఆమె షాపింగ్ మాల్‌లో ఉన్న కొత్త డిజైన్ల పట్టు చీరలను ప్రదర్శించారు. అలాగే అనకాపల్లి ఎంపీ కె.సత్యవతి, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, తుని నియోజకవర్గ టీడీపీ నేత యనమల కృష్ణుడు తదితరులు జ్యోతి ప్రజ్వలనచేసి షాపింగ్ మాల్‌లోని వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ ప్రతినిధులు జి.శ్రీనివాసరావు, ఎస్.రత్తయ్య, కట్టా నూకరాజు, గిరిధర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా పాయకరావుపేటలో లక్కీ షాపింగ్ మాల్‌ను ప్రారంభించేందుకు వచ్చిన సినీ నటి అనసూయను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో స్థానిక చిత్రమందిర్ సెంటర్ కిక్కిరిసింది. షాపింగ్ మాల్ ఎదుట నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

రాష్ట్రస్థాయి ఉత్సవంగా నూకాంబిక కొత్త అమావాస్య జాతర

» జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ


నూకాంబికను దర్శించుకున్న కొణతాల

అనకాపల్లి టౌన్, మార్చి 20: రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్రస్థాయి ఉత్సవంగా నిర్వహిస్తామని అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ తెలిపారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడంలో భాగంగా నూకాంబిక అమ్మవారిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణలతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. అనంతరం స్థానిక విలేకరులతో శ్రీనివాస కల్యాణ మండపంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం రావడం ఖాయమని, వచ్చిన వెంటనే కొత్త అమావాస్య ఉత్సవాలను రాష్ట్రస్థాయి ఉత్సవంగా నిర్వహిస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఆలయానికి తీసుకువస్తానని చెప్పారు. అనకాపల్లిలో తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే ఒక ఏడాది నంది ఉత్సవాలు అనకాపల్లిలో తప్పనిసరిగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

ప్రాధాన్యతారంగాలపై బ్యాంకులు దృష్టి పెట్టాలి

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):
జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బ్యాంకర్లు వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, స్వల్పకాలిక వ్యవసాయ రుణాలపై మరింత దృష్టి పెట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ స్వల్పకాలిక రుణాలు అందజేయాలన్నారు. తోటలు, కూరగాయాలు, పశు సంవర్ధక, డెయి రీ, మత్స్య పరిశ్రమలలో కాలానుగుణంగా ఉత్పత్తి సాధించే రంగాలకు ఆర్థిక చేయూత ఇవ్వాలని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజరు సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో రుణ ప్రణాళికను వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.5,088.12కోట్లు, ఎంఎస్ఎంఈకి రూ.1,566.62 కోట్లు కేటాయించామని తెలిపారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు ప్రాంతీయ అధికారి పి.నరేశ్, నాబార్ డీడీఎం సుమంత్‌కుమార్, మెప్మా పీడీ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

అనితపై అసత్య వార్త.. పోలీసులకు టీడీపీ ఫిర్యాదు

పాయకరావుపేట, మార్చి 20: తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితపై సోషల్ మీడియాలో వేటూ న్యూస్ పేరిట వచ్చిన ఫేక్ న్యూస్‌పై పోలీసులు పూర్తి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి పలువురు టీడీపీ నాయకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం పట్టణంలో ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత షాపింగ్ మాల్ యాజమాన్యాన్ని బెదిరించి సుమారు రూ.50 లక్షల విలువైన చీరలు తీసుకెళ్లిపోయారని, దీనిపై షాపింగ్‌మాల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారంటూ వేటూ న్యూస్ పేరిట వార్తను సోషల్ మీడియాలో పోస్టు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట అసెంబ్లీకి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న వంగలపూడి అనితకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఫేక్ వార్తను అధికార పార్టీ అండతో సోషల్ మీడియాలో పోస్టు చేశారని ఆరోపించారు. దీనిపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేసి బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లా విలియంకేరి, చింతకాయల రాంబాబు, ఎం.రమాకుమారి, లెక్కల గోవిందు, పి.సూరిబాబు, వేములపూడి అప్పారావు, ఆది, సీహెచ్.పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్‌లో అమ్మకానికి చెరకు విత్తనం

అనకాపల్లి అగ్రికల్చర్, మార్చి 20 : ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో చెరకు విత్తనం అందుబాటులో వుందని, అవసరమైన రైతులు కొనుగోలు చేసుకోవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ పి.వి.పద్మావతి తెలిపారు. 2009ఎ107 వశిష్ఠ రకం నాలుగు టన్నులు, 2009ఎ252 నవీన్ రకం ఐదు టన్నులు వుందని, కొత్త వంగడం 2010ఎ 229 రకం ఏడు టన్నుల విత్తనం అందుబాటులో వుందని పేర్కొన్నారు. మొదటి రెండు రకాలు టన్ను రూ.2,800, చివరి రకం టన్ను రూ.3000లకు విక్రమిస్తున్నట్టు చెప్పారు. వివరాలకు 9704074493 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా టెన్త్ ఇంగ్లీషు పరీక్ష

అనకాపల్లి రూరల్, మార్చి 20: పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం ఇంగ్లీషు పరీక్షను ప్రశాంతంగా నిర్వహించినట్టు డీఈవో వెంకటలక్ష్మి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 21,229 మందికి గాను 21,123 మంది హాజరు కాగా, 106 మంది గైర్హాజరు అయ్యారన్నారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు 229 మంది హాజరుకావాల్సి ఉండగా, 92 మంది హాజరై 137 మంది గైర్హాజరు అయినట్టు ఆమె తెలిపారు.

సైకిల్‌పై అయోధ్య చేరిన మణీంద్ర


అయోధ్యలో మణీంద్ర

అచ్యుతాపురం, మార్చి 20: అచ్యుతాపురం నుంచి సైకిల్‌పై బయలు దేరిన మణీంద్ర క్షేమంగా అయోధ్య చేరుకున్నాడు. అచ్యుతాపురం మండలం కొల్లివానిపాలేనికి చెందిన పైల మణీంద్ర(28) ఈ నెల 11న అచ్యుతాపురం ఎంపీడీవో కార్యాలయం నుంచి సైకిల్‌పై బయలు దేరాడు. ఈ నెల 19వ తేదీ రాత్రి ఏడు గంటలకు మణీంద్ర అయోధ్య చేరుకున్నాడు. మొత్తం 17 వందల కిలోమీటర్ల ప్రయాణాన్ని తొమ్మిది రోజుల్లో పూర్తి చేశాడు.

కానిస్టేబుల్, హోంగార్డుకు నగదు రివార్డు

అనకాపల్లి రూరల్, మార్చి 20: ఆటోలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను పట్టుకున్న పోలీసు, హోంగార్డుకు ఎస్పీ కేవీ మురళీకృష్ణ బుధవారం రివార్డులు అందజేశారు. సబ్బవరం స్టేషన్ కానిస్టేబుల్ పి.వరదేశినాయుడు, హోంగార్డు జె.నాగేశ్వరరావు మంగళవారం తెల్లవారుజాము చింతపల్లి నుంచి సబ్బవరం మీదుగా తునికి గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. విధులను సక్రమంగా నిర్వహించినందుకు వీరికి బుధవారం నగదు రివార్డును అందించారు.

వడ్డాది వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

» స్వామివారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు


స్వామి వారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

బుచ్చెయ్యపేట, మార్చి 20: మండలంలోని వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల ను బుధవారం ధ్వజారోహణం, అంకురార్పణతో ఘనంగా ప్రారంభించారు. అంతకు ముందు స్వామి, అమ్మవార్లను పసిడి ఆభరణాలతో అలంకరించారు. అర్చకులు సహస్రనామ, అష్టోత్తర నామాలతో పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీ పెరిగిపోవడంతో పోలీసులు అప్రమత్తమై వాహనాలను కొండ దిగువనే నిలిపివేశారు. భక్తులు క్యూలైన్లలో బారులు తీరడంతో స్వామి వారికి అభిషేకాలు నిలిపివేసి, దర్శనం మాత్రమే కల్పించారు. వేద పండితులు రాత్రి 9.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని ప్రారంభించారు. మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోయుక్తంగా తిరుకల్యాణం నిర్వహించారు. ఈ ప్రక్రియ ముగిసే సరికి అర్ధరాత్రి అయ్యింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. భక్తుల గోవింద నామస్మరణలతో గిరిజాంబగిరి మారుమోగింది. కాగా కొత్తకోట సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ డి.ఈశ్వరరావు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. విద్యుత్ సరఫరాకు పలుమార్లు అంతరాయం ఏర్పడడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

జగన్ ఓటమే లక్ష్యంగా పనిచేస్తాం

» సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు. చిత్రంలో సంఘానికి చెందిన ఇతర ప్రతినిధులు ఉన్నారు

విశాఖపట్నం, మార్చి 20: రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటమే ధ్యేయంగా పనిచేస్తామని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు ప్రకటించారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసి, సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని ఆరోపించారు. పంచాయతీల్లో సమస్యలపై తమ సంఘం గత మూడున్నరేళ్లుగా ఆందోళనలు చేస్తున్నదన్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పంచాయతీలకు జరిగిన అన్యాయం వివరిస్తామన్నారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతకాయల ముత్యాలరావు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్ల ఏర్పాటు పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. సర్పంచుల సమస్యలను పరిష్కరించే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇస్తామని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు సోమేశ్వరరావు, అప్పలరాజు, అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార అనుమతులకు సింగిల్ విండో: డీఆర్వో

అనకాపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారంతోపాటు ఇతర అనుమతులు పొందేందుకు కలెక్టర్ కార్యాలయంలో సింగిల్ విండో విభాగాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు/అభ్యర్థుల ఎన్నికల ప్రచారాలకు సంబంధించిన అనుమతులను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు జారీ చేస్తారని చెప్పారు. అనుమతుల కోసం 'సువిధ' యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హెలీకాప్టర్, హెలీప్యాడ్, ఎయిర్ బెలూన్‌లకు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాత్రమే అనుమతి ఇస్తారన్నారు. సభలు, సమావేశాలు, పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలు, ప్రచార వాహనాలు, ఊరేగింపులు, బారికేడ్ల నిర్మాణాలకు నియోజకవర్గాల ఆర్ఓల నుంచి అనుమతులు పొందాలన్నారు. ఇంటింట ప్రచారం, ర్యాలీలకు 48 గంటల ముందుగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లే వ్యక్తులు లేదా సంస్థలు ఇందుకు సంబంధించిన ఆధారాలతో ఏ అవసరం నిమిత్తం సొమ్ము తీసుకెళ్తున్నారో ముందుగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమిటీ వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం పరిశీలకులు డి.రామ్మూర్తి, ఎస్వీ తులసీరామ్, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు, రూ.లక్ష నగదు సీజ్

కృష్ణాదేవిపేట, మార్చి 20: గొలుగొండ మండలం ఏఎల్‌పురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు రూ.లక్ష నగదును సీజ్ చేసినట్టు ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం శరభవరం గ్రామానికి చెందిన నానిబాబు లక్ష రూపాయల నగదుతో తన స్నేహితుడు సాదనాల దుర్గాశివప్రసాద్‌తో కలిసి కృష్ణాదేవిపేట మీదుగా కారులో వెళుతున్నాడు. ఏఎల్‌పురం చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి తగిన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేశారు.

సక్రమంగా అమలుకాని ఎన్నికల కోడ్



మోసయ్యపేట ఫిష్ మార్కెట్‌లో సీఎం జగన్ బొమ్మతో వున్న బోర్డు

అచ్యుతాపురం, మార్చి 20: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా చాలా చోట్ల సీఎం జగన్, ఎమ్మెల్యేల చిత్రాలతో ఉన్న బోర్డులను అధికారులు తొలగించలేదు. ఆవసోమవరం సచివాలయానికి పక్కనే కిరాణా షాపు ఉంది. దానిపై సీఎం జగన్ ఫొటోతో బోర్డు ఉంది. దాన్ని ఇంకా తొలగించలేదు. ఇక అచ్యుతాపురం - గాజువాక ప్రధాన రహదారిలో గల మోసయ్యపేట సంతలో ఫిష్ మార్కెట్ బోర్డులపై తూతూ మంత్రంగా కాగితాలు అతికించారు. బుధవారం కురిసిన వర్షానికి అవి పోయాయి. బోర్డు యథావిధిగా కనిపిస్తున్నది. దుప్పితూరు పంచాయతీ సచివాలయాల ముఖద్వారంపై ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఫొటోలు ఉండడంతో వాటిపై కాగితాలు అతికించారు. కాగా టీడీపీ సర్పంచులున్న పంచాయతీల్లో ఎన్నికల నియమావళిని సక్రమంగా అమలు చేస్తున్నారని, వైసీపీ సర్పంచులు ఉన్న పంచాయతీల్లో నియమావళి అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

అనకాపల్లి నియోజకవర్గం

శ్రీవారి ఆలయంలో ధ్వజారోహణం

అనకాపల్లి టౌన్, మార్చి 20 : దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా బుధవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి కల్యాణంలో భాగంగా మల్లవరపువారి వీధిలోని కరణం ఇంటి వద్ద ఎదురుసన్నాహం చేపట్టారు. ఆలయ ఈవో టి.రాజసులోచన, అర్చకులు పులకండం విజయబాబు, పులకండం గిరిబాబు, ప్రసాద్‌బాబు, రాజేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

కశింకోట, మార్చి 20 : బయ్యవరంలో కనకమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఎంపీ సత్యవతి, డాక్టర్ విష్ణుమూర్తి దంపతులు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు, ఏఎంసీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కృష్ణ మందిరంలో భక్తిశ్రద్ధలతో అర్ధ ఏకాహం

అనకాపల్లి టౌన్, మార్చి 20 : ఇక్కడి గౌరీ పంచాయతన ఆలయం గీతా మందిరంలో బుధవారం ఫాల్గుణ మాసం ఏకాదశి సందర్భంగా కృష్ణమందిరంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. హరేరామ హరే కృష్ణ నామ సంకీర్తనలతో అర్ధ ఏకాహం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గౌరీ గీతామందిరం ప్రతినిధులు వేగి సత్యవతి, ఆడారి లక్ష్మి, గౌరీ పంచాయతన ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో బహుళ ప్రయోజనాలు

తుమ్మపాల, మార్చి 20 : సేంద్రియ ఎరువుల ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని అగ్రికల్చర్ ఇంట ర్నెల్ కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. ఎస్‌వీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పలు గ్రామాల్లో వ్యవసాయ విద్యార్థులకు సేంద్రియ ఎరువుల వాడకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఐసీఆర్‌పీ బృందం కృష్ణవేణి, హేమలత, రేవతి, లక్ష్మీమోహన్, ఎస్‌వీడీఎస్ సంస్థ సభ్యులు కోన అప్పారావు, చక్రవర్తి పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'

తుమ్మపాల, మార్చి 20 : టీడీపీతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు అని ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మాదంశెట్టి నీలబాబు అన్నారు. 84వ వార్డులో బుధవారం టీడీపీ నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణను గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. బొలిశెట్టి శ్రీనివాసరావు, సిరసపల్లి సన్యాసిరావు, సాలాపు మోహన్, కశిరెడ్డి సత్యనారాయణ, వెంకటరావు, జగన్, రాంబాబు, లక్ష్మీప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

సినీ నటుడు శోభన్‌బాబుకు నివాళి

అనకాపల్లి టౌన్, మార్చి 20 : దివంగత సినీనటుడు శోభన్‌బాబు 16వ వర్ధంతిని ఆలిండియా శోభన్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు ముగడ అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం విజయరామరాజుపేటలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి విజయరామరాజుపేట పెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలకా రాము, ఆళ్ల శివరామ సత్యనారాయణ, కొయిలాడ జగ్గఅప్పారావు, పి.శ్రీను, పిట్ల రాజు, ఒమ్మి రాము, సూర్య రామకృష్ణ పాల్గొన్నారు.

వాన కురిసె.. జనం మురిసె..

▸▸ ఉపరితల ఆవర్తనంతో విడతల వారీగా కురవడంతో చల్లబడిన వాతావరణం



అనకాపల్లి పట్టణంలో వర్షం కురుస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, మార్చి 20 : ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలోని పలుచోట్ల బుధవారం వర్షం కురిసింది. అనకాపల్లి పట్టణంలో ఉదయం నుంచి మబ్బు వాతావరణం ఉంది. పదకొండు గంటల సమయంలో ఒక్కసారిగా వర్షం పడింది. ఆ తరువాత తెరిపిచ్చి మళ్లీ ఒంటిగంట సమయంలో కురిసింది. వాణిజ్య కేంద్రమైన అనకాపల్లికి వివిధ పనులపై వచ్చే గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడక తప్పలేదు. సాయంత్రం వరకు చిరుజల్లులు పడడంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. ఈ కారణంగా విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏది ఏమైనప్పటికీ పదిరోజులుగా ఎండలతో అల్లాడిన జనం వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు.

పరవాడ : మండల కేంద్రం పరవాడ, పరిసర ప్రాంతాల్లో బుధవారం తేలికపాటి వర్షం కురిసింది. సుమారు అర్ధగంటకు పైగా వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఇటీవల కాసిన ఎండలతో అల్లాడిపోయిన ప్రజానీకానికి ఈ వర్షం ఊరటనిచ్చింది. సింహాద్రి ఎన్టీపీసీ, వాడ చీపురుపల్లి, ఫార్మాసిటీ ప్రాంతాల్లో కూడా వర్షం కురిసింది.

సబ్బవరం : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. దాదాపు నెల రోజులుగా ఎండలతో అల్లాడుతున్న జనం వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీ, జనసేనలో చేరిక

కశింకోట, మార్చి 20 : మండలంలోని అచ్చెర్ల గ్రామానికి చెందిన పలువురు వైసీపీకి చెందిన వార్డు సభ్యులు, కార్యకర్తలు బుధవారం తెలుగుదేశం, జనసేన పార్టీల్లో చేరారు. ఒకటో వార్డు సభ్యుడు మినకుర్తి గోవిందరావు, వేపాడ గోవింద, శరగడం జగ్గారావు, చూచికొండ చిరంజీవి, ఎం.రాజారావు, బొడ్డేడ, గణేష్, దొడ్డి శ్రీను, మంజుల, రామకృష్ణలు టీడీపీ, జనసేనలలో చేరారు. వీరికి రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, నిమ్మదల సన్యాసినాయుడు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి తదితరులు ఆయా పార్టీల కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ, జనసేన నాయకులు పావాడ కామరాజు, సిద్దిరెడ్డి శ్రీనివారావు, పెంటకోట రాము, బుదిరెడ్డి మోహన్, నైనంశెట్టి రమణారావు, రమేష్, షేక్ బాబర్, జెర్రిపోతుల నూకునాయుడు, వెంకటలక్ష్మి, రెడ్డి ధనలక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతం కావాలి'

కశింకోట, మార్చి 20 : రాష్ట్రంలో అరాచక పాలన అంతం చేయడానికి యువత నడుంబిగించాలని అనకాపల్లి అసెంబ్లీ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. తాళ్లపాలెంలో బుధవారం ఉమ్మడి పార్టీల కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, ప్రజలను కష్టాలపాలు చేసిన జగన్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కాయల మురళీ, పొన్నగంటి అప్పారావు, ఉగ్గిన రమణమూర్తి, గొంతిన శ్రీనివాసరావు, నిమ్మదల సన్యాసినాయుడు, కర్రి సత్యనారాయణ, గల్లా రాజు, పావాడ కామరాజు, కర్రి గోవింద, పెంటకోట రాము, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, కర్రి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



గాజు గ్లాసు గుర్తు చూపుతున్న కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

అనకాపల్లి టౌన్ : అసెంబ్లీ నియోజకవర్గంలో ఉగాదిలోగా మొదటి విడత ఎన్నికల ప్రచారాన్ని పూర్తి చేస్తామని కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక న్యూకాలనీలోని టీడీపీ నాయకుడు సూరే సతీష్‌వర్మ ఇంటి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పై తగిన చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి అసెంబ్లీ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, పట్టణ అధ్యక్షులు డాక్టర్ నారాయణరావు, మళ్ల సురేంద్ర, బీఎస్ఎంకే జోగినాయుడు, జనసేన నాయకులు శ్రీరామదాసు గోవింద, తాడి రామకృష్ణ, దూలం గోపి, మళ్ల శ్రీను, బీజేపీ నాయకులు కొణతాల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట ఇచ్చి, మడమ తిప్పి...

... 5వ పేజీ తరువాయి

నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా పలు మార్లు మాట ఇచ్చారు. ఇందుకోసం రెగ్యులరేటరీ కమిషన్‌ను ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు.

నివేదిక ఏమైనట్టు..?

జగన్మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. ఆలూరి సాంబశివా రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిషన్ అనేక అంశాలను కూలంకుషంగా పరిశీలించి నివేదికను సమర్పించింది. అయితే, ఐదేళ్లు కావస్తున్నా ఆ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కమిషన్ ఏం నివేదిక ఇచ్చిందో ఇప్పటివరకూ చెప్పలేదని, ప్రభుత్వం ఏర్పాటై ఐదేళ్లు పూర్తయినా ఇప్పటికీ తమకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని టీచర్లు, లెక్చరర్లు వాపోతున్నారు. ప్రైవేటు కాలేజీలు, స్కూల్స్‌లో పనిచేసే సిబ్బందిని జగన్మోహన్‌రెడ్డి నమ్మించి మోసం చేశారని ప్రైవేటు టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.లోకనాథం విమర్శించారు.

రాష్ట్రంలో తాము నాలుగు లక్షల మంది ఉన్నామని, కుటుంబ సభ్యులతో కలిపితే సుమారు పది లక్షల ఓట్లు ఉంటాయన్నారు. తమను మోసం చేసిన ఈ సర్కారుకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఐదేళ్ల కిందట ఏర్పాటు చేసిన రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయకుండా ఎందుకు మోసం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

అన్న క్యాంటీన్లపై కక్ష

... 5వ పేజీ తరువాయి

కూరగాయలు, కొబ్బరికాయల మార్కెట్లలో పనిచేసే కార్మికులకు ఎంతో ఉపయోగపడేది. ఉదయం 300-400 మంది అల్పాహారం చేసేవారు. మధ్యాహ్నం 500-600, రాత్రి 300-400 మంది కడుపునిండా భోజనం తినేవారు. రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, గోదావరి జిల్లాలకు వ్యవసాయ పనులకు వెళ్లివచ్చే కూలీలు భోజనాలు చేసేవారు. క్యాంటీన్ తలుపులు తెరవకముందే పెద్ద సంఖ్యలో క్యూలో నిల్చునేవారు. క్యాంటీన్ల వద్ద పండగ వాతావరణం కనిపించేది. అయితే గత ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ పెద్దలు 2019 ఆగస్టులో అన్న క్యాంటీన్ల మూసివేయించారు. ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో ఉన్న క్యాంటీన్ భవనాన్ని ఏడాదిపాటు నిరుపయోగంగా వుంచారు. కొవిడ్ సమయంలో ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి, కరోనా బాధితుల నుంచి శాంపిల్స్ తీసి నిర్ధారణ పరీక్షలు చేసేవారు. కొవిడ్ ప్రభావం తగ్గిన తరువాత దీనిని మూసివేశారు. రైల్వేస్టేషన్ వద్ద వున్న క్యాంటీన్ భవనాన్ని నిరుపయోగంగా వదిలేయడంతో చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి.

లోపల సామగ్రి పాడైపోయింది. నాడు అన్న క్యాంటీన్లలో 15 రూపాయలతో ఒకసారి టిఫిన్, రెండుసార్లు భోజనాలు చేసేవారమని, వైసీపీ ప్రభుత్వం వీటిని మూసివేసిన తరువాత టిఫిన్, రెండుసార్లు భోజనాలకు రూ.200లకుపైగా ఖర్చు చేయాల్సి వస్తున్నదని పలువురు కార్మికులు, కూలీలు వాపోతున్నారు.

పెందుర్తి నియోజకవర్గం

పరదేశిమాంబ విగ్రహ ప్రతిష్ఠ



కలశతో ప్రదక్షిణ చేస్తున్న గ్రామ పెద్దలు

సబ్బవరం, మార్చి 20 : మండల కేంద్రం సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెంలో పరదేశిమాంబ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు కలశం, యంత్రంతో ప్రదక్షిణలు జరిపారు. అనంతరం మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, గండి బాబ్జి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, సర్పంచ్ దెడ్డం ప్రసాద్, గ్రామ పెద్దలు కొటాన రాము, కొటాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'బండారు'కు టికెట్ కోసం కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో టీడీపీ శ్రేణుల ర్యాలీ

పరవాడ, మార్చి 20 : పెందుర్తి నియోజకవర్గం టీడీపీ తరపున మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి టికెట్ కేటాయించాలని కోరుతూ బుధవారం రాత్రి వెన్నెలపాలెంలో ఆ పార్టీ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, నాయకులు అట్టా సన్యాసిఅప్పారావు, పైలా చినఅక్కునాయుడు, ఇందల కొండలరావు, వియ్యపు చిన్న, పైలా రథాల సన్యాసిరావు, గొర్లి కనకారావు, కేఆర్‌కె రాజు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం!

... 5వ పేజీ తరువాయి

పైభాగంలో డ్రైవర్ల విశ్రాంతి భవనం సన్‌షేడ్ కూలిపడింది. అక్కడ నిలిపి ఉంచిన ఐదు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. జన్నవరం జంక్షన్‌లో కిరాణా దుకాణంపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. వెంటనే సరఫరా నిలిచిపోవడంతో అక్కడ వున్న వారు ఊపిరిపీల్చుకున్నారు. వెంకన్నపాలెం పరిధిలో పలు చోట్ల విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో చోడవరంతోపాటు పలుగ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 8 గంటలకు కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు.

ఎలమంచిలి మండలంలో వర్షంతోపాటు ఈదురుగాలులు వీచడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. పులపర్తిలో కొబ్బరి చెట్టు విద్యుత్ వైర్లపై పడింది. పీఎస్ఆర్ పేటలో రోడ్డుకు అడ్డంగా భారీ చెట్టు కూలిపోయింది. రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.

కాగా రానున్న 24 గంటల్లో జిల్లా అంతటా మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఎలమంచిలి నియోజకవర్గం

పరిహారం కోసం మత్స్యకారుల ఆందోళన



నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

అచ్యుతాపురం, మార్చి 20: పూడిమడక హార్బర్ కోసం నిర్మిస్తున్న రహదారి పనుల్లో తాము కోల్పోయిన చెట్లకు పరిహారం ఇవ్వాలని మత్స్యకార మహిళలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. పూడిమడక సర్వే నంబరు 134/2, 135లోని ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో 45 ఏళ్లుగా జీడిమామిడి, మామిడి తోటలు వేసుకొని వచ్చిన ఆదాయంతో జీవిస్తున్నామని, అయితే రోడ్డు నిర్మాణానికి అడ్డంగా ఉన్నాయని చెట్లను కూల్చివేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జీవనాధారం కోల్పోయినందున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సరోజినికి వినతిపత్రం అందించారు.

నేడు మార్టూరులో నూకాంబిక ఉత్సవం



అచ్యుతాపురం, మార్చి 20: మండలంలోని మార్టూరు గ్రామంలో నూకాంబికా అమ్మవారి ఉత్సవాన్ని గురువారం నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ కేకే శ్రీనుబాబు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి సుమారు 20 వేలకు పైచిలుకు భక్తులు ఉత్సవానికి రావచ్చని, వారికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. గురువారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.





ఎలమంచిలిలో హోరున కురుస్తున్న వాన... కోటవురట్ల రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు

భారీ వర్షం.. ఈదురుగాలుల బీభత్సం

ఎలమంచిలి/పాయకరావుపేట/అచ్యుతాపురం/కోటవురట్ల/రాంబిల్లి/ఎస్.రాయవరం, మార్చి 20: ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. అలాగే పలు మండలాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఎలమంచిలి మండలంలోని పులపర్తి గ్రామంలో విద్యుత్ వైర్లపై కొబ్బరి చెట్టు పడింది. అలాగే పీఎస్ఆర్ పేటలో మద్యం దుకాణానికి సమీపంలో రోడ్డుకు అడ్డంగా భారీ చెట్టు నేలకొరిగింది. జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా, విద్యుత్ సరఫరాకు రెండు గంటల పాటు అంతరాయం ఏర్పడింది.

అలాగే అచ్యుతాపురంలో బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తోంది. సాయంత్రం మూడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు సక్రమంగా విద్యుత్ సరఫరా జరగలేదు. దీంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పాయకరావుపేట మండలంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో భారీ వర్షం పడింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘాలుకమ్మి చిన్న చినుకులతో ప్రారంభమైన వర్షం కొద్ది సేపటికి భారీ వర్షంగా మారి అర్ధ గంట పాటు పడింది. పలు పనులపై బయటకు వెళ్లిన ప్రజలు వర్షానికి తడిసి ముద్దవగా, చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కోటవురట్ల మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు మెరుపులతో భారీ వర్షం పడింది. బుధవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైంది. మండలంలో కె.వెంకటాపురం వెళ్లే దారిలో ఈదురుగాలులకు రోడ్డుపై చెట్టు కూలిపోయింది. దీంతో ఇదే రోడ్డుపై వెళుతున్న టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులను తీసుకెళుతున్న ఆర్టీసీ బస్సు రెండు గంటలపాటు నిలిచిపోయింది.

ఎస్.రాయవరం మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి కొద్ది సమయం వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లో రైతులు మినప, పెసర పంటలకు చెందిన నూర్పిడి పనుల్లో నిమగ్నం కానున్నారు. వర్షాల కారణంగా పంటలు దెబ్బతింటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాంబిల్లి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం తేలికపాటి వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం పడింది. సుమారు గంటపాటు వర్షం కురవడంతో ప్రధాన రోడ్లు వర్షం నీటితో జలమయమయ్యాయి. ఎండ ప్రభావంతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ఈ వర్షం కారణంగా వాతావరణం చల్లబడటంతో ఊరిపి పీల్చుకున్నారు. ఆగా, గ్రామాల్లోని పలు చోట్ల చెట్లపై పిడుగులు కూడా పడ్డాయని, దీంతో భయాందోళనకు గురయ్యామని రైతులు తెలిపారు.

బండిమాంబను దర్శించుకున్న సుందరపు



అమ్మవారిని కటుంబ సమేతంగా దర్శించుకుంటున్న విజయ్‌కుమార్

ఎలమంచిలి, మార్చి 20: ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారిని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోను అమ్మవారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలమంచిలి నియోజకవర్గం నుంచి పోటీచేసే అభ్యర్థులు ముందుగా బండిమాంబ అమ్మవారిని దర్శించుకుని ఏటికొప్పాక గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించడం ఆచారం. ఇందులో భాగంగానే సుందరపు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

సంప్రదాయ వైద్య విధానంపై కార్యకర్తలకు శిక్షణ

రాంబిల్లి, మార్చి 20: మండలంలోని హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం పశువుల సంప్రదాయ వైద్య విధానంపై విస్తరణ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీటీ కేవీకే పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయరాజ్ఞి సంప్రదాయ పశు వైద్య చికిత్స విధానంపై శిక్షణ ఇచ్చారు. పశు వైద్యుల సలహాలు లేకుండా పశువులకు యాంటిబైటిక్ మందులను వాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీటీ కేవీకే ముఖ్య కార్యదర్శి బి.శ్రీరామమూర్తి, శాస్త్రవేత్తలు బి.శ్రీహరిరావు, నాగేంద్రప్రసాద్, ఎనిమిది మండలాల్లో పశువైద్య శాఖకు చెందిన 53 మంది విస్తరణ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం

పాయకరావుపేట, మార్చి 20: పట్టణంలో వైసీపీ కార్యాలయాన్ని ఎంపీ కె.సత్యవతి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు డి.బాబి, ప్రచార విభాగం చైర్మన్ డి.సాయిబాబా, నాయకులు డి.బాబూరావు, జె.శ్రీనివాసరావు, డి.వెంకటేశ్వరరావు, రాజేష్‌ఖన్నా, కె.మోహన్, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో పాడి గేదె మృతి

రాంబిల్లి, మార్చి 20: కృష్ణంపాలెం గ్రామంలో పాడి రైతు కె.నరసింగరావుకు చెందిన గేదె బుధవారం పిడుగుపాటుతో మృతి చెందింది. సాయంత్రం నాలుగు గంటలకు గాలులతో వర్షం కురవడంతో పాటు మెరుపులతో పిడుగు పడడంతో సుమారు రూ.1 లక్ష విలువచేసే పాలు ఇస్తున్న గేదె మృతి చెందిందని పాడి రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

బలవంతంగా కండువాలు వేయడం సిగ్గుచేటు

రాంబిల్లి: పంట పొలాలకు సాగునీటి కోసం ఎమ్మెల్యేను కలవడానికి వెళ్లిన బీజేపీ నేతలకు బలవంతంగా కండువాలు వేయడం సిగ్గుచేటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కారే రాముడు ఆరోపించారు. ఇలాంటి నీచ రాజకీయాలు మానుకోవాలని సూచించారు. పార్టీ నేతలు శ్రీనివాసరావు, ఉమ్మిడి వెంకటేశ్వరులు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాయకరావుపేట నియోజకవర్గం




అనితను సత్కరిస్తున్న పాయకరావుపేట సర్పంచ్ ఉషశ్రీ

టీడీపీలో సముచిత స్థానం కల్పిస్తాం

▸▸ పార్టీ పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత

పాయకరావుపేట, మార్చి 20: టీడీపీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ పాయకరావుపేట అభ్యర్థి, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత చెప్పారు. పాయకరావుపేటలోని పలువురు నాయకులను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరులతో కలిసి సర్పంచ్ గారా ఉషశ్రీ ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అనితతో పాటు పలువురు టీడీపీ నాయకులను సర్పంచ్ గారా ఉషశ్రీ, ప్రసాద్ ఘనంగా సత్కరించారు. అనంతరం వైసీపీ నుంచి సస్పెండైన వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి కలిశారు. టీడీపీలోకి చేరాలని, పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని అనిత తెలిపారు. ఈ సందర్భంగా గూటూరు శ్రీను మాట్లాడుతూ త్వరలో నిర్ణయం వెల్లడిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల గరగల ఊరేగింపు



కుమారపురంలో పల్లకిలో గరగరలను ఊరేగిస్తున్న భక్తులు

పాయకరావుపేట రూరల్, మార్చి 20: మండలంలోని కుమారపురం గ్రామంలో బుధవారం ఉపమాక ఏకాదశి సందర్భంగా గ్రామ దేవతల గరగరలను ఘనంగా ఊరేగించారు. అనంతరం గరగరలను ఉపమాక దేవస్థానానికి తీసుకు వెళ్లారు. ప్రతి ఏటా ఉపమాక ఏకాదశి నాడు గ్రామంలోని నూకాలమ్మ, మరిడమ్మ, పోలేరమ్మ, దుర్గమ్మ తదితర దేవతల గరగరలను ఉపమాక దేవస్థానానికి తీసుకువెళ్లి, అక్కడి నుంచి మరునాడు ఉదయం గ్రామానికి తీసుకు వచ్చి కొత్త అమావాస్య వరకు ఇంటింటికీ తిప్పడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం..

▸ గిరిజాంబ గిరిపై ఘనంగా శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న కల్యాణం



స్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న పండితులు

బుచ్చెయ్యపేట, మార్చి 20 : వడ్డాదిలోని గిరిజాంబ గిరిపై కొలువుదీరిన స్వయంభూ శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం బుధవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన రామకృష్ణశర్మ, ఆలయ అర్చకులు శ్రీకాంత్ ఆచార్యులు ఆధ్వర్యంలో రాత్రి 8.30 గంటలకు ప్రారంభమై పదకొండు గంటలకు ముగిసింది. ముందుగా గణపతి పూజ, స్వామి వారికి అర్చన, మంగళహారతి తదితరాలను నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిల కల్యాణాన్ని దొండా శ్రీరామ్ జరిపించారు. ఈ వేడుకను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది.



స్వామి దర్శనానికి క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు

అన్న క్యాంటీన్లపై కక్ష

... 5వ పేజీ తరువాయి

కూరగాయలు, కొబ్బరికాయల మార్కెట్‌లలో పనిచేసే కార్మికులకు ఎంతో ఉపయోగపడేది. ఉదయం 300-400 మంది అల్పాహారం చేసేవారు. మధ్యాహ్నం 500-600, రాత్రి 300-400 మంది కడుపునిండా భోజనం తినేవారు. రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, గోదావరి జిల్లాలకు వ్యవసాయ పనులకు వెళ్లివచ్చే కూలీలు భోజనాలు చేసేవారు. క్యాంటీన్ తలుపులు తెరవకముందే పెద్ద సంఖ్యలో క్యూలో నిల్చునేవారు. క్యాంటీన్ల వద్ద పండగ వాతావరణం కనిపించేది. అయితే గత ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ పెద్దలు 2019 ఆగస్టులో అన్న క్యాంటీన్ల మూసివేయించారు. ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో ఉన్న క్యాంటీన్ భవనాన్ని ఏడాదిపాటు నిరుపయోగంగా వుంచారు. కొవిడ్ సమయంలో ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి, కరోనా బాధితుల నుంచి శాంపిల్స్ తీసి నిర్ధారణ పరీక్షలు చేసేవారు. కొవిడ్ ప్రభావం తగ్గిన తరువాత దీనిని మూసివేశారు. రైల్వేస్టేషన్ వద్ద వున్న క్యాంటీన్ భవనాన్ని నిరుపయోగంగా వదిలేయడంతో చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. లోపల సామగ్రి పాడైపోయింది. నాడు అన్న క్యాంటీన్లలో 15 రూపాయలతో ఒకసారి టిఫిన్, రెండుసార్లు భోజనాలు చేసేవారమని, వైసీపీ ప్రభుత్వం వీటిని మూసివేసిన తరువాత టిఫిన్, రెండుసార్లు భోజనాలకు రూ.200లకుపైగా ఖర్చు చేయాల్సి వస్తున్నదని పలువురు కార్మికులు, కూలీలు వాపోతున్నారు.

అకాల వర్షం!



చోడవరం మండలం జన్నవరం వద్ద కూలిన కరెంటు స్తంభం

... 5వ పేజీ తరువాయి

పైభాగంలో డ్రైవర్ల విశ్రాంతి భవనం సన్‌షేడ్ కూలిపడింది. అక్కడ నిలిపి ఉంచిన ఐదు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. జన్నవరం జంక్షన్‌లో కిరాణా దుకాణంపై విద్యుత్ స్తంభం విరిగిపడింది. వెంటనే సరఫరా నిలిచిపోవడంతో అక్కడ వున్న వారు ఊపిరిపీల్చుకున్నారు. వెంకన్నపాలెం పరిధిలో పలు చోట్ల విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో చోడవరంతోపాటు పలుగ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 8 గంటలకు కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు.

ఎలమంచిలి మండలంలో వర్షంతోపాటు ఈదురు గాలులు వీచడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. పులపర్తిలో కొబ్బరి చెట్టు విద్యుత్ వైర్లపై పడింది. పీఎస్ఆర్ పేటలో రోడ్డుకు అడ్డంగా భారీ చెట్టు కూలిపోయింది. సుమారు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాగా రానున్న 24 గంటల్లో జిల్లా అంతటా మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది.



మాడుగుల : ఎం.కోటపాడు, కేజేపురం జంక్షన్ల మధ్య గోతుల్లో చేరిన వర్షపు నీరు

ఎండా కాలంలో కుండపోత

▸ చోడవరంలో ఈదురు గాలుల బీభత్సం ▸ విరిగిపడిన చెట్ల కొమ్మలు, కటౌట్లు ▸ నాతవరంలో లోతట్టు ప్రాంతాలు జలమయం



చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద డ్రైవర్ల విశ్రాంతి గది సన్‌షేడ్ కూలిపోవడంతో ధ్వంసమైన వాహనాలు

చోడవరం, మార్చి 20 : ఉపరితల ఆవర్తనం ప్రభావం కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం వర్షం కురిసింది. చోడవరం మండలంలో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం సుమారు గంటపాటు పడింది. గాలులకు వెంకన్నపాలెం పరిధిలోని పలు చోట్ల విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడడంతో పలు గ్రామాలతో పాటు, పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి ఎనిమిది గంటలకు కూడా పట్టణంలోని చాలా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. ఈదురు గాలుల ధాటికి ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ పైభాగంలోని డ్రైవర్ల విశ్రాంతి భవనం సన్‌షేడ్ కూలిపడింది. ఆ సయంలో అక్కడ నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలపై పడడంతో ఐదు వాహనాలు ధ్వంసమయ్యాయి. కాంప్లెక్స్ ముందున్న ఓ రేకుల షెడ్ కూడా కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ప్రయాణికులెవరూ అక్కడ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే, ఓ జ్యూస్ పార్లర్ వద్ద కటౌట్ విరిగిపడింది. ఈదురు గాలులకు జన్నవరం జంక్షన్‌లోని సాలాపు నరసింహమూర్తికి చెందిన కిరాణా దుకాణంపై విద్యుత్ స్తంభం విరిగిపడిన ఘటనలో దుకాణం గోడ కూలిపోయింది. స్తంభం కూలిపోయిన వెంటనే సరఫరా నిలిచిపోవడంతో దుకాణంలో ఉన్నవారితో పాటు, వర్షం పడుతుండడంతో తడవకుండా ఉండేందుకు అక్కడికి చేరిన వారు ఊపిరి పీల్చుకున్నారు.

బుచ్చెయ్యపేట : ఎండవేడితో ఇబ్బంది పడుతున్న మండల ప్రజానీకానికి బుధవారం కురిసిన మోస్తరు వర్షం ఉపశమనం కలిగించింది. నాలుగు నెలలుగా వరుణుడు కరుణించకపోవడంతో వేసవి తాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ తరుణంలో బుధవారం ఉదయం నుంచి వేడివాతావరణం ఉన్నప్పటికీ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి నాలుగు గంటల వరకు జల్లులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లపడింది. ఈ వర్షం సరుగుడు, కార్శి చెరకు, నువ్వు ప

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మండలంలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిశాయి. దీంతో గొలుగొండ, జోగంపేట, పాకలపాడు, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, సాలికమల్లవరం, పాతమల్లంపేట, పప్పుశెట్టిపాలెం, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, నాగాపురం తదితర గ్రామాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మెరక పంటలకు ఇవి మేలు చేస్తాయని రైతులు చెపుతున్నారు.



నాతవరం- గుమ్మిడిగొండ రోడ్డులో చెరువును తలపించేలా వర్షపు నీరు

నాతవరం : మండలంలో బుధవారం సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి మబ్బు వాతావరణం ఉన్నప్పటికీ మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. అనంతరం కుండపోతగా వానపడింది. జీడితోటలకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు చెపుతున్నారు. అయితే ప్రస్తుతం పొలాల్లో రైతులు తీస్తున్న మినప పంటకు నష్టం జరగనుందని అంటున్నారు. చెరువుల్లో కొస్త నీరు చేరడంతో పశువులకు తాగేందుకు ఉపయోగపడుతుందని పాడిరైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రావికమతం : వాతావరణంలో మార్పుల కారణంగా బుధవారం మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉండగా, మధ్యాహ్నం ఇక్కసారివా వానపడింది. ఈ వర్షం చెరకు తోటలకు, జీడిమామిడి తోటలకు మేలు చేస్తుందని రైతులు చెపుతున్నారు.

మాడుగుల రూరల్ : మండలంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆకాశం మేఘావృతమై ఉంది. ఒంటి గంట సమయంలో తేలికపాటి జల్లులతో మొదలై మోస్తరుగా పడింది. దీంతో ఎం.కోటపాడు- కేజేపురం జంక్షన్ మధ్య ఆర్అండ్‌బీ రహదారిపై గల గోతుల్లో నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఐక్యంగా పనిచేద్దాం.. విజయాన్ని సాధిద్దాం

▸ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు మాడుగుల అభ్యర్థి 'పైలా' పిలుపు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో మాడుగుల ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాద్

కె.కోటపాడు, మార్చి 20 : మండలంలోని గవరపాలెంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు బుధవారం మాడుగుల టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన కర్రి నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పైలా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు ప్రజలంతా చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రానున్న ఎన్నికల్లో అంతా టీడీపీకి ఓటు వేసి చంద్రబాబుకు పట్టం కట్టాల్సిందిగా కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు డెక్క అప్పలనాయుడు, కర్రి స్వామినాయుడు, డెక్క రమణ, పైలా ఎరుకునాయుడు, లెక్కల లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దామని మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. బుధవారం ఎం.కోడూరులో లక్ష్మీనారాయణ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఘాట్‌రోడ్డు జంక్షన్‌లోని పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, అప్పాన భాస్కరావు, రాయపురెడ్డి కృష్ణ, దయా, శివాజీ, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ఇమ్మాన్యుయేలు పాఠశాలపై చర్యలకు వినతి



అధికారిణికి వినతిని అందిస్తున్న బీజేపీ నాయకులు

మాకవరపాలెం, మార్చి 20 : తామరం గ్రామంలో నిర్వహిస్తున్న ఇమ్మాన్యుయేలు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు బుధవారం ఎంఈవో కార్యాల సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. పాఠశాలకు ఆనుకొని ఉన్న ఏలేరు కాలువులో ఏటా విద్యార్థులు చనిపోతున్నారని ఆరోపించారు. ఇటీవల పాఠశాలలో చదువుతున్న బాలుడు కాలువులో పడి చనిపోవడం బాధాకరమన్నారు. ఈ పాఠశాలలో పిల్లలకు మరుగుదొడ్లు, రక్షణ లేకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

'గోవాడ' సభ్య రైతు కుటుంబానికి సాయం

బుచ్చెయ్యపేట, మార్చి 20 : ప్రమాదవశాత్తు బుచ్చెయ్యపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయి చనిపోయిన సుంకర పోతురాజు భార్య అచ్చెయ్యమ్మకు బుధవారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సీడీవో రామం పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. జనరల్ ఫండ్‌తో పాటు ప్రమాద బీమా మంజూరైన వెంటనే అందజేస్తామని తెలిపారు.

దత్తాత్రేయ, ఆంజనేయ విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భక్తుల పూజలు

చోడవరం, మార్చి 20 : పట్టణంలోని వాసవీమాత ఆలయంలో బుధవారం దత్తాత్రేయ, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో అర్చకుల బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలగర్ల శేషు దంపతులతో పాటు ఉప్పల నాగరాజు, వాసవీ, వనితా క్లబ్, యూత్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పది పరీక్షా కేంద్రం తనిఖీ చేసిన తహసీల్దార్

రోలుగుంట, మార్చి 20 : ఇక్కడి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ రవిచంద్ర తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. పరీక్షలు ముగిసే వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలని అక్కడి అధికారులకు సూచించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, మార్చి 20 : వైసీపీకి మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రం రావణకాష్టంలా మారడం ఖాయమని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. వెంకయ్యపాలెంలో బుధవారం ఎన్నికల శంఖారావం సభ నిర్వహించారు. ముందుగా ఆ గ్రామానికి చెందిన వైసీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు అడిగర్ల శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు అడిగర్ల నాగమణితో పాటు 30కుటుంబాలు, చినరాచపల్లికి చెందిన వార్డు సభ్యుడు చింతల రాజు, మాజీ ఉప సర్పంచ్ చింతల హరిచంద్ర, మాజీ వార్డు సభ్యుడు రాంబాబుతో పాటు 20 కుటుంబాలు, రామన్నపాలేనికి చెందిన మాజీ సర్పంచ్ నక్కిన ప్రకాష్, చల్ల గణేశ్‌తో పాటు మరో పది కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి మాట్లాడారు. వైసీపీ అరాచక పాలన పోవాలంటా ప్రజలంతా టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు, నాయకులు రుత్తల నందకిశోర్, పోతురాజు, రుత్తల శేషుకుమార్, రుత్తల జోగిపాత్రుడు, లక్ష్మనాయుడు, ఏకా రాము, బీజేపీ నాయకులు అడిగర్ల రాంబాబు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సత్యహరిశ్చంద్ర విగ్రహం ఆవిష్కరణ



కైలాసవాటికలో ఆవిష్కరించిన హరిశ్చంద్ర విగ్రహం

బుచ్చెయ్యపేట, మార్చి 20 : విజయరామరాజుపేట కైలాసవాటికలో బుధవారం సత్యహరిశ్చంద్ర విగ్రహాన్ని ఆవిష్కరించారు. బుద్ధా నాగేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు సమారు లక్ష రూపాయిలు వెచ్చించి ఈ విగ్రహాన్ని తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

వైద్యం చేస్తున్న మందుల షాపు సీజ్

▸ తనిఖీల్లో గుర్తించిన అనకాపల్లి ప్రాంతీయ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రా భారతి



షాపులో తనిఖీలు చేస్తున్న ఇంద్రా భారతి

దేవరాపల్లి, మార్చి 20 : మెడికల్ షాపుల్లో శాంపిల్స్ మందులు, కాలం చెల్లిన మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అనకాపల్లి ప్రాంతీయ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రా భారతి హెచ్చరించారు. బుధవారం ఆమె ఇక్కడ పలు మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. స్టాక్‌తో పాటు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వెంకటేశ్వర మందుల షాపులో వైద్యం చేస్తున్నట్టు తన తనిఖీలో వెల్లడైందన్నారు. దీంతో సదరు షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. షాపును తాత్కాలికంగా సీజ్ చేశామన్నారు. అనంతరం ఆమె షాపుల యజమానులతో మాట్లాడుతూ మందులు కొనుగోలు చేసిన వినియోగదారులకు విధిగా రశీదులు ఇవ్వాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించేవారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

గొలుగొండ మండల సమావేశం రేపు

గొలుగొండ, మార్చి 20 : ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 22న గొలుగొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో రత్నకుమారి తెలిపారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఎంపీడీవోగా జాన్ లింకన్ బాధ్యతలు



రోలుగుంట, మార్చి 20 : ఇక్కడి ఎంపీడీవోగా కె.జాన్‌లింకన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న కె.వెంకటేశ్వరరావు అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లడంతో జాన్‌లింకన్‌కు ఎఫ్ఏసీ ఎంపీడీవోగా నియమించారు.

ఒడ్డు చింతల కళ్లాల వద్ద గిరినాగు హల్‌చల్



దేవరాపల్లి, మార్చి 20 : ఇక్కడి ఒడ్డు చింతల కళ్లాల వద్ద బుధవారం గిరినాగు పాము హల్ చల్ చేసింది. కళ్లాల నుంచి ఇంటికి వస్తున్న రైతులు రోడ్డుపై దీనిని చూడి హడలిపోయారు. సుమారు 13 అడుగుల ఉన్న ఈ పామును చూసి భయంతో వారు హతమార్చారు.

మాట ఇచ్చి, మడమ తిప్పి...

... 5వ పేజీ తరువాయి

నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా పలుమార్లు మాట ఇచ్చారు. ఇందుకోసం రెగ్యులరేటరీ కమిషన్‌ను ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు.

నివేదిక ఏమైనట్టు..?

జగన్మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటుచేశారు. ఆలూరి సాంబశివా రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిషన్ అనేక అంశాలను కూలంకుషంగా పరిశీలించి నివేదికను సమర్పించింది. అయితే, ఐదేళ్లు కావస్తున్నా ఆ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కమిషన్ ఏం నివేదిక ఇచ్చిందో ఇప్పటి వరకూ చెప్పలేదని, ప్రభుత్వం ఏర్పాటై ఐదేళ్లు పూర్తయినా ఇప్పటికీ తమకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని టీచర్లు, లెక్చరర్లు వాపోతున్నారు. ప్రైవేటు కాలేజీలు, స్కూల్స్‌లో పనిచేసే సిబ్బందిని జగన్మోహన్‌రెడ్డి నమ్మించి మోసం చేశారని ప్రైవేటు టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.లోకనాథం విమర్శించారు. రాష్ట్రంలో తాము నాలుగు లక్షల మంది ఉన్నామని, కుటుంబ సభ్యులతో కలిపితే సుమారు పది లక్షల ఓట్లు ఉంటాయన్నారు. తమను మోసం చేసిన ఈ సర్కారుకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టంచేశారు. ఐదేళ్ల కిందట ఏర్పాటుచేసిన రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయకుండా ఎందుకు మోసం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి

▸ సిబ్బందికి ఎన్నికల అధికారులు ఆదేశం



వడ్డిపలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, రిటర్నింగ్ ఆఫీసర్ చిన్నికృష్ణ

రోలుగుంట, మార్చి 20 : పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ చిన్నికృష ఆదేశించారు. మండలంలోని రోలుగుంట, రత్నంపేట, బీబీపట్నం, ఎంకేపట్నం, వడ్డిప తదితర గ్రామాల్లో బుధవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వృద్ధులకు, వికలాంగులకు అనువుగా ఉండేలా ర్యాంపులు నిర్మించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రవిచంద్ర తదితరులు ఉన్నారు.



యరకన్నపాలెంలో సూచనలు చేస్తున్న నోడల్ అధికారి జాన్‌లింకన్

నర్సీపట్నం మండలంలో...

నర్సీపట్నం అర్బన్, మార్చి 20 : మండలంలోని వేములపూడి, అమలాపురం, యరకన్నపాలెం, మెట్టపాలెం గ్రామాల్లో నియోకవర్గ ఎన్నికల నోడల్ అధికారి కె.జాన్ లింకన్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కోడ్ అమలు తీరును పరిశీలించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఎవరూ అతిక్రమించకుండా చూడాలన్నారు. ఒకవేళ అతిక్రమించే చేపట్టే చర్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్‌లు తొలగించే బాధ్యత స్థానిక అధికారులదేనన్నారు. రాజకీయ నాయకుల ప్రచారాలు, సమావేశాలు వంటివాటికి ముందస్తుగా అనుమతిని విధిగా పొందాలన్నారు.